# సత్యం మారలేదు

వాతవరణ కాలుష్యం మీద జరుగుతున్న సెమినార్‌కి ఆహ్వానం వచ్చింది.

ఒక పుష్కరం తరువాత హైదరాబాద్ చూసే అవకాశం వచ్చింది. అంతేకాదు నగర పొలిమేరల్లో వున్న ఖానాపూర్ గ్రామం లోని జిల్లా పరిషత్తు స్కూల్లో కలిసి చదువుకున్న నా స్నేహితుల్ని ఇద్దర్ని కలుసుకునే అదృష్టం కలిగింది. సంతోషంతో బయలుదేరాను ఢిల్లీనుండి.

నా ఉత్తరం చూసుకుని, సెమినార్ అవగానే నా బసకు వచ్చి, సత్యం, శంకరయ్యా నన్ను ఎంతో అప్యాయంగా వాళ్ళ ఊరు తీసుకు పోయారు. గ్రామానికి పొయే గతుకుల రోడ్డు అలానే వుంది. గాంధీ బొమ్మ అలానే వుంది. కానీ, ఏదో చౌకబారు రంగు పులిమినట్టున్నారు. గాంధీగారి ముఖంలో విషాదఛాయలు ముసురుకున్నట్లు అనిపించింది నాకు.

ఆ రోజుల్లో నేనూ, శంకరయ్యా, సత్యం కలిసి చదువుకునే

వాళ్ళం. అంజయ్యా, యాదగిరీ మాకంటే కొంచెం పెద్దవాళ్ళే కానీ పరీక్ష తప్పి మా క్లాసులోనే వుండేవారు వాళ్ళను చూస్తే మాకు కొంత క్రేజ్, హీరో వర్షిప్ ఆ రోజుల్లో వున్నమాట నిజమే. మాకులేని స్వేచ్ఛ వాళ్ళు అనుభవించే వారు. కొత్త టీచర్లను ఏడిపించేవారు. ఎవరో సినీ హీరో పేర అభిమాన సంఘం నడిపి మొదటి రోజునే కొత్త సినిమాకు టిక్కెట్లు సంపాదించేవారు. బ్లాకులో అమ్మి మేం చూస్తూ వుండగా నోట్లు లెక్క పెట్టుకునే వారు. ఎలక్షన్ల రోజుల్లో గ్రామ సర్పంచి, హెడ్ మాస్టరుకు చిట్టీ పంపి వీళ్ళని రప్పించుకునే వాడు. ఎన్నికలు రేపు అనగా ఎవరెవరి ఇళ్ళకు తాళాలు వున్నాయో, ఎవరు ఊర్లోలేరో చూసి చెప్పడం, వాళ్ళ ఓట్లు ఎవరిచేత వేయించాలో ఏర్పాటు (ఇంతి జాం) చెయ్యడం వీళ్ళ డ్యూటీ. వాళ్ళకున్న పలుకుబడికి మాకు ఆ చిన్న వయసులో ఎంతో ఈర్ష్య కలిగేది. మమ్మల్ని కూడా వాళ్ళలో చేరమని ఆహ్వానించేవారు. అలాంటి సమయంలో ఆ ఆకర్షణలోంచి తప్పించి మాకు ఒక కొత్త మలుపు ఇచ్చినవాడు కొత్తగా వచ్చిన రంగనాయకులు టీచరే అని చెప్పకతప్పదు.

ఆయన మొదటి క్లాసులో అంజయ్యా, యాదగిరీ ఇకిలించారు, సకిలించారు. కానీ, రంగనాయకులు కోపం తెచ్చుకోలేదు. ప్రశాంతంగా రెండు మాటలు స్పష్టంగా చెప్పారు. "కాపీలు కొట్టి, పేపర్లు సంపాదించి నూటికి నూర్లు తెచ్చుకునే అడ్డుదార్లు ఇవాళా రేపూ వుంటాయి. పరీక్ష పాసు అవడానికే అయితే నా క్లాసులో వుండక్కర లేదు. నిజమైన చదువు చదువుకుని మీకు జరుగుతున్న మోసాన్ని అర్థం చేసుకోగలగాలి. మీలాంటి సాటి ప్రజల్ని మోసంలోంచి అన్యాయంలోంచీ రక్షించాలి. అలాటి చదువు కావాలంటే నా పాఠం వినండి. వద్దనుకుంటే అటెండెన్సు వేసుకుని వెళ్ళిపోవచ్చు" అన్నారు.

తరువాత కాలం-దూరం లెక్కలు చెప్పారు. టెలిఫోన్ స్తంభం బొమ్మ వేశారు. ఒక రైలు బొమ్మ గీశారు. స్తంభం దాటడమంటే ఆ రైలు దాని పొడుగు ఎంత ఉందో అంతదూరం ప్రయాణం చెయ్యాలని చూపించారు. అందరు పిల్లలచేత చిన్నచిన్న ప్రశ్నలు వేసి, సమాధానం రప్పించి ఒక రైలు ఎంత వేగంగా ప్రయాణం చేస్తోందో అంచనా వెయ్యడం సులభంగా బోధపర్చారు. ఆయన పాఠం పిల్లల్ని ఆకట్టుకుంది. ఆ ఏడు అందరం మంచి మార్కులతో పాస్ అయ్యాం. అలా జరిగిన బాల్యం మేం ముగ్గురం నెమరు వేసుకున్నాం.

సాయంత్రం దాటినాక మూడు విడతలుగా ఏదో వాసన గాలిలో వచ్చి కడుపులో తిప్పింది. నాకు వాంతి అయింది. "ఏమిటి వాసన" అన్నాను, "ఏదో మందుల కంపెనీ వాడు ఈ మధ్య రెండేళ్ళుగా ఎక్కువగా ఇలాటి గ్యాసు గాలిలోకి వదుల్తున్నాడు. బావిలో నీళ్ళు కూడా కషాయం రంగులో వుంటాయి" అన్నాడు శంకరయ్య. సత్యం ఒక పెద్ద ఫైల్ తెచ్చి నా ముందు వుంచాడు. దానిలో సత్యం పత్రికలకు వ్రాసిన ఉత్తరాలూ, సర్పంచ్‌కీ, శాసనసభ్యుడికీ చేసిన ఫిర్యాదులూ చూపించాడు. శంకరయ్య సత్యం అంత అమాయకుడు కాదు. "ఇప్పుడు సర్పంచ్ ఎవరనుకున్నావు? మనతో చదువుకున్న అంజయ్య. ఎమ్మెల్యే ఎవరనుకున్నావు యాదగిరి. వీళ్ళు ఎలక్షన్ల ముందు ఈ కాగితాలూ, కంప్లయింట్లు చూపించి 'మందుల కంపెనీ వాడి దగ్గర బాగా డబ్బూ, ఓట్లూ కూడా గుంజుకున్నారు. మాజీ ఎం.పి. బినామీగా అతని తమ్ముడి పేర నడుపుతున్న మాయదారి కంపెనీ అది. పారిశ్రామిక చట్టాలు పాటించి, వ్యర్థ పదార్థాలు విడగొట్టాలంటే లక్షలు ఖర్చు. ఇలా గాలిలో నీటిలో వదిలేస్తే చౌకగా

గడిచిపోతుంది. అంజయ్యా! యాదగిరీ మన గ్రామంలో వుందరు సిటీలో కాపురం" అన్నాడు. మరునాడు ఉదయం నేను నా బసకు పోతూ వుంటే దినపత్రికలో పడ్డ ఏదో వార్తను చదివి సత్యం కొండెక్కినంత సంతోషిస్తున్నాడు. పైకి చదివి వినిపించాడు కూడా. "కాలుష్యాన్నీ వ్యర్థ పదార్థాల్నీ కాలువల్లోకీ, నదుల్లోకీ వదలి వెయ్యడం పారిశ్రామికులకు అలవాటైపోయింది. ఇకపై ఆటకట్టు, నీరు కలుషితం కాగానే ఆ సంగతి ఎన్నో మైళ్ళ దూరంలో వుండే మానిటర్‌కి తెలియజేసి అలారం మ్రోగించగల పరికరాన్ని ఉత్తర ఐర్లాండ్ శాస్త్రజ్ఞులు కనుగొన్నారు."

శంకరయ్య శాంతంగా విని "అవి మనకి పనికి రావయ్యా, దేశం నిండా అలారమ్‌లు మ్రోగి మ్రోగి శబ్ద కాలుష్యం కూడా పెరుగుతుంది. ఇప్పుడు కాలుష్యం ఎవరు చేస్తున్నారో తెలియక కాదు మన బాధ. వాళ్ళని నిర్మొహమాటంగా నిలదీసి శిక్షించే కంప్యూటర్లు కావాలి వాటిని ప్రజలే కనిపెట్టాలి కానీ......." అన్నాడు. ఉత్సాహభంగంతో అవాక్కయిన సత్యాన్ని చూస్తే చిన్నతనం రోజులు జ్ఞాపకం వచ్చాయి.

"సత్యం మారలేదు" అనుకున్నాను జాలిగా.

—ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 23-6-89